

బాన్సువాడలోని తాడ్కోల్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– బాన్సువాడ, ఏప్రిల్ 21

## సమ్మర్ క్యాంప్‌నకు విశేష స్పందన




సమ్మర్ క్యాంపునకు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి, ఏప్రిల్ 21 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉచిత క్రికెట్ శిక్షణకు ఆదివారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారని కామారెడ్డి క్రికెట్ ప్రెసిడెంట్, సమ్మర్ క్యాంపు ఇన్‌చార్జి ఎండీ మోజాం అలీఖాన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 22వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ముప్పారపు ఆనంద్, వైస్ ప్రెసిడెంట్ విపుల్, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, రమణ, ఆజామ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



చెట్లను నరికి వేసిన దృశ్యం



# హరితహారంపై గొడ్డలి వేటు

- ఏండ్ల తరబడి కాపాడిన చెట్లు మాయం
- కాల్చివేయడం, నరికి వేతకు గురవుతున్న వైనం
- అధికారులు ఎందుకు స్పందిండం లేదని ప్రశ్నిస్తున్న ప్రజలు





చెట్లను కాల్చివేసిన దృశ్యం

మోర్తాడ్, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పచ్చదనాన్ని పెంచేందుకు అప్పటి సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విజయవంతం చేశారు. ఇందులో భాగంగా తొమ్మిదేండ్ల పాటు ఏటా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా టార్గెట్లు పెట్టి మరీ మొక్కలు నాటించారు. ఇందులో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామాల్లో ప్రతిరోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటించడం, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వాటికి ప్రతిరోజూ నీళ్లు పట్టించి పెంచడం చేశారు. ఇంత కష్టపడి పెంచిన చెట్లను ప్రస్తుతం కొందరు నరికివేస్తున్నారు. నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. వడ్యాట్–కమ్మర్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. మొక్కలను పెరగకుండా చేయడానికి మొక్క కింద నిప్పు పెడుతున్నారు. పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో ఏండ్లపాటు పడ్డ శ్రమ అంతా వృథా అవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్లు నరికి వేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. ఊరూరా నర్సరీలు నిర్వహిస్తూ మొక్కలను పెంచి వాటిని నాటడం నరికేయడం కోసమేనా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మహనీయుల జయంతి



మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థినులు

బాన్సువాడ, ఏప్రిల్ 21 : పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబా పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, హెచ్‌డబ్ల్యూవో గంగాసుధ, కుమ్మరి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారం, 45 తులాల వెండి, రూ. 50 వేల నగదు చోరీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 21 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లగుట్ట తండాలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగుట్ట తండాకు చెందిన ఉప్పులంచ్వారు శ్రీరామ్ తన ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి ఎల్లారెడ్డి గ్రామంలోని ఓ పెండ్లికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు.. ఇంటి తాళం పగులగొట్టి 4 తులాల బంగారు ఆభరణాలు, 45 తులాల వెండి వస్తువులతోపాటు రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. శ్రీరామ్ శనివారం రాత్రి 8 గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# స్పెషల్ ఆఫీసర్లు ఎక్కడా?

- ఎక్కడి సమస్యలు అక్కడే
- అందుబాటులో ఉండని అధికారులు




బీబీపేట గ్రామ పంచాయతీ

బీబీపేట్, ఏప్రిల్ 21: సర్పంచులు పదవీకాలం పూర్తి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం స్పెషల్ ఆఫీసర్ల పాలనను తీసుకువచ్చింది. బీబీపేట్‌తో పాటు ఆయా గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండడంలేదని ప్రజలు అంటున్నారు. గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు 10 రోజులకోసారి వచ్చి కానీసం 10 నిమిషాలు కూడా ఉండడంలేదని ఆయా గ్రామా పంచాయతీ సిబ్బంది మాట్లాడుకుంటున్నారు. బీబీపేట్ మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్యతోపాటు ఇతర సమస్యలు ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు రాకపోవడంతో సమస్యలు ఎలా తెలుస్తాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు వచ్చేలా చూడాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డి, ఏప్రిల్ 21 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ హైస్కూల్‌లో 2000–2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్థానిక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. 24 సంవత్సరాల తర్వాత కలుసుకొని విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## నేడు డోంగ్లీకి గాలి అనిల్‌కుమార్ రాక

డోంగ్లీ, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారానికి జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సోమవారం వస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు శశాంక్‌పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అతడితోపాటు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు హాజరవుతారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం దిశానిర్దేశం చేస్తారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## విలేజ్ నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

గాంధారి, ఏప్రిల్ 21: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టాలని పేర్కొన్నారు. మొక్కల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా విత్తనాలు నాటాలని పేర్కొన్నారు. జూన్‌లో నాటడానికి మొక్కలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను మండలంలోని ఉత్తునూరు గ్రామస్తులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వివరించారు. మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. ఆయనవెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మొక్కల కోసం సిద్ధం చేసిన బ్యాగుల్లో మొలిచిన పిచ్చిమొక్కలు



నర్సరీలో మొక్కలు లేకుండానే నీళ్లు పడుతున్న వనసేవకుడు

# నర్సరీల్లో మొక్కల్లేవ్..!

- హరిత లక్ష్యం.. బహు దూరం
- విలేజ్ నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తం
- పెరగని మొక్కలు.. నిండా చెత్తాచెదారం
- అధికారుల పర్యవేక్షణ కరువు



కాస్లాబాద్‌లో నర్సరీ నిర్వహణ ఇలా..

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 21: రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరిత హారం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా మండలంలోని 25 గ్రామాల్లో ఒక్కో నర్సరీ చొప్పున మొత్తం 25 విలేజ్ నర్సరీలను ఏర్పాటుచేసింది. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలను పెంచేలా ప్రణాళిక రూపొందించారు. మూడు నెలల క్రితమే నర్సరీలకు అవసరమైన ప్లాస్టిక్ కవర్లు, విత్తనాలను సరఫరా చేశారు. కానీ నర్సరీల్లో మొక్కలను పెంచడంలో నిర్లక్ష్యం కనిపిస్తున్నది. హరితహారం పథకంలో భాగంగా వానలు కురియగానే మొక్కలను నాటాల్సి ఉంటుంది. కానీ అనుకున్న లక్ష్యానికి, నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలకు తేడా చాలా ఉన్నది. లక్ష్యం మేరకు మొక్కలు నర్సరీల్లో కనిపించడం లేదు. ఇలా అయితే హరితహారంలో మొక్కలను నాటేదెలా అని మండల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

***నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తం..***

జూన్ నాటికి ప్రతి నర్సరీలో పది వేల మొక్కలను సిద్ధం చేయాలని అధికారులు ప్రణాళికలు తయారుచేశారు. నర్సరీల్లో పలు రకాల పండ్లు, పూల మొక్కలతోపాటు టేకు, వెదురు, కానుగ, గోరింటాకు తదితర మొక్కలను పెంచాలని నిర్ణయించారు. నర్సరీ నిర్వహణ కోసం వన సేవకుడిని నియమించారు. నర్సరీలో మొక్కల రక్షణను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు. మండలంలో మొత్తం 2.50లక్షల మొక్కలను జూన్ నాటికి సిద్ధం చేయాల్సి ఉండగా.. చిన్న దేవీ సింగ్ తండా, అంజని, కాస్లాబాద్, వడ్లం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన నర్సరీల్లో మొక్కలు కనిపించడం లేదు. ప్లాస్టిక్ కవర్లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. మొక్కలు లేకున్నా వన సేవకులు మాత్రం ఖాళీ బ్యాగులకు నీళ్లు పడుతున్నారు. మొక్కల రక్షణ కోసం గ్రీన్ షేడ్ నెట్లను ఏర్పాటు చేయకపోవడంతో వేడికి మొక్కలు ఎండిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారిస్తే ఉన్న మొక్కలను రక్షించుకోవచ్చని అంటున్నారు.

## ఘనంగా శివపార్వతుల కల్యాణం

రామారెడ్డి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు బండారి చంద్రశేఖర్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఇలా..! ప్రయాణం ఎలా..?



ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి ఇలేగావ్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

డోంగ్లీ, ఏప్రిల్ 21: రవాణా వ్యవస్థ బాగున్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. కాని మండలంలోని పలు గ్రామాల రోడ్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ప్రజలు నానా ఇబ్బంది పడాల్సి వస్తున్నది. అత్యవసర సమయాల్లో ప్రయాణం కష్టంగా మారుతుంది. దవాఖానకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన కొత్తగా రోడ్లు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, PERKA SAYANNA S/o. Perka Narsaiah R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU SAYANNA S/o. Boddu Nadipi Narsaiah
NTZ-324905

CHANGE OF NAME
★I, PERKA LAXMI BAI W/o. Perka Narsaiah R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU LAXMI W/o. Boddu Nadipi Narsaiah
NTZ-324904

CHANGE OF NAME
★I, PERKA RAJITHA W/o. Perka Sayanna R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU RAJITHA W/o. Boddu Sayanna
NTZ-324906

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రోడ్డు పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు



గాంధారిలోని ఓ వైన్స్ పక్కన పారవేసిన ప్లాస్టిక్ గ్లాసులు

గాంధారి, ఏప్రిల్ 21: మద్యం దుకాణంలోని పర్మిట్ రూమ్‌లో వాడిన ప్లాస్టిక్ గ్లాసులు, వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. అయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని చద్మల్ రోడ్డుకు వెళ్లేదారిలో పర్మిట్ రూమ్ ఉన్నది. అక్కడి వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించకుండా రోడ్డు పక్కడే పారేస్తున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించేవారు వాటి నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలిదురామం వచ్చినప్పుడు ప్లాస్టిక్ గ్లాసులు రోడ్డుపైకి కొట్టుకురావడంతోపాటు సమీపంలో ఉన్న ఇండ్లలోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్డు పక్కనే పారవేస్తున్న వైన్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కంకర వేశారు.. తారు మరిచారు..



వాహనాలు ప్రయాణిస్తుండడంతో రోడ్డుపై చెలరేగుతున్న దుమ్ము

గాంధారి, ఏప్రిల్ 21: మండలంలోని కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై పొతంగల్ కలాన్ స్టేజీ నుంచి చందానాయక్ తండా వరకు కంకర రోడ్డును వేశారు. దానిపై తారును(డాంబార్) వేయడం మరిచిపోయారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారిపై ఆరు నెలల క్రితం కంకర వేసి వదిలేశారు. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర వేసి వదిలివేయడంతో దుమ్మూధూళితో కండ్లతోపాటు శ్వాస పీల్చుకోవడం ఇబ్బందిగా మారుతున్నదని, వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై తారు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.